# ఆనంద మందిరము

"మీరనుదినమును వందలకొలది సీసాలనుత్తవి గావించు చుండ నేను దినమునకొక యాలి చిప్పెడు పానీయము నర్థించిన నపరాధమేమి? ఈ నా చిన్న కోరికనే నిరాకరింతురా?" యని యొకనాటి సంధ్యా సమయమున మాలతి నిజమనోమన్మథుడగు మన్మథరావును ప్రశ్నించెను.

మన్మథరావు మహారాష్ట్ర వంశజుడు. పూనా నగరవాస్తవ్యుడు. అతడుత్తమకుల సంజాతయు, సుప్రసిద్ధన్యాయవాదియగు మాధవరాయని యనుంగు పుత్రికయునగు మాలతిని పరిణయమాడి నిరభ్యంతర సంతోషవంతుడై యెసగుచుండెను. మన్మథరావొక మహోన్నతోద్యోగి. అతడు రెండు చేతులతోడను ధనమార్జించుచుండుట చేతను, తదయ పిత్రార్జిత విత్తము కూడా నపారమై యుండుట వలనను, నక్కాలమున మన్మథునివంటి ధనికులరుదుగ గన్పట్టుచుండిరి. అట్టి మహదైశ్వర్యశోభితుడును, నిర్విచారమనస్కుడునగు మన్మథరావునకు బరమేశ్వరానుగ్రహమున నవమన్మథాకారుడగు పుత్రకుడుదయించెను. ఇక మన మన్మథుని యానంద స్రవంతి కడ్డంకులేవి కలవు? ఆ మహోత్సవకాలము వాస్తవముగ దనకదృష్ట దాయకమనియు, లోకమునినిక దన్నుమించిన యదృష్టవంతుడుండడనియు మన్మథు డూహించెను. అతడట్లెంచిన దప్పులేదు! ఆస్థితిలో నెల్లరట్లే తలంపకపోరు! పుత్రోదయమైనది కదా యని మన్మథుడు సంతోషము పట్టజాలక వివిధ భంగుల నద్దానిని వెళ్ళబోసెను. అతని స్నేహితులెల్లరతని యుత్సాహమున బాల్గొనిరి. మన్మథరావు విచ్చల విడిగా ధనము వెచ్చించెను. అతడు చేసిన విందులకుగాని, దానధర్మములకుగాని పరిమితి లేకపోయెను. అతని దాతృత్వమునకు మెచ్చి యనేకులాతనికి దానకర్ణుడని బిరుదొసంగిరి. అతని పేరు ప్రజలు రామనామమువలె జపించుచుండిరి. అదృష్టమన మన్మథరావుదేకదా! భూలోకమున దనజన్మము సార్థకమైనదని యాతడూహించెను.

౨

పూనా నగరమున నానందమందిరమనియెడు మనోజ్ఞభవన మొకటి కలదు. అది రామణీయకనిధానమే యైనను త్రాగుడు కొంపయునగుటవలన నద్దానిని తక్కుంగల భవనములట్లు పూర్తిగా గౌరవింపవీలులేదు! అయినను నాభవనమున జనసంచారమపారము. గొప్ప గొప్ప వారనేకులా భవనమునందలి గౌరవముచేత నెల్లప్పుడామందిరమునందే పడియుందురు. రాత్రిందినములా ప్రదేశము ధనిక యువకుల చేత గ్రిక్కిరిసి యుండును. అందెల్లవారలును నిరంతర మద్యపాన పరాయణులై స్వపర తారతమ్యముల నెఱుంగజాలక "పీత్వా పీత్వా పునః పీత్వా" యనెడు తారకమంత్రమును జపించుచుందురు. విదేశములనుండి దిగుమతి కాబడిన విలువగల మత్తుపదార్థములు నలుగురి చేతులలోన సాగిపోవుచుండును. అసంఖ్యాకమగు సేవకబృందము వచ్చిన ప్రభువులకు వడ్డనలోప

మొనర్ప కుందురు. ఆ మనోజ్ఞమందిరమున మద్యదేవత మూర్తీభవించి తన్నుపాసించిన వారల దన్మయుల జేయుచుండెను. ఎల్లవారలా దేవమూర్తిని వినయ విధేయతలతోడ నర్చించుచు నధికానంద సంభరిత స్వాంతులగుచుండిరి.

అట్టి యాదివ్యప్రదేశమునకు గొందఱు యువకులేగుదెంచిరి. వారెల్లరును మన్మథుని మిత్రజనులు. వారినడుమ మన్మథరావు కూడా కలడు. అమాయకుడగు నామన్మథుడు స్నేహితుల యాచ్చిక బుచ్చికల కలరి యచ్చటికి వచ్చి యుండెను. అతనికిది వఱకు తమ పురమునందే యట్టిచోటొకటి కలదని తెలియదు. అట్టి దివ్యదర్శనము నేడతనికి మిత్రుల కరుణావేశమున నయాచితముగ లభించినది. వివిధ వాక్యసందోహవృష్టి గురిపించుచు మిత్రులాతని నిటకు దోడ్కొని వచ్చి తమలో తాము కన్నులగీటుకొనుచు "నేడు మన మిత్రుడందఱకు దక్కువ చేయకుండ కావలసినంత కడుపులో పోయించునురా! మఱి కాచుకొనుడు! ఎవనికేమాత్ర మోపిక కలదో? పందెములు వేసికొని మఱియు కానీయుదము! కాకున్న వేడిపుట్ట"దని ప్రోత్సాహపూర్వకముగ బల్కుకొనిరి.

మన్మథునికీ చర్యలు మనస్కరించుట లేదు! ప్రాణముల బిగబట్టుకొని నిల్చియుండెను. చెప్పరాని తొందఱతో సేవకులాగంతకుల రాక. నవలోకించి యొక విశాలమగు బల్లముందా సనములను పేర్చి గౌరవించిరి. అంతట మన్మథుని మిత్రులెల్లరు నాసనముల నాక్రమించి మిత్రునిగూడ గూర్చుండజేసిరి. క్షణకాలములోన సేవకులు సుందరముగ నలంకరింపబడిన బల్లమీద వివిధ వర్ణ ప్రశస్తములగు సీసాలతోడ పానీయముల నలంకరించిరి. ఎల్లరుసు సంతోషపూర్వకముగ నిలువేల్పునారాధింప నుపక్రమించిరి. మన్మథుడు మాత్రము నిశ్చేష్టితుడయ్యెను. అతని గుండెలు కొట్టుకొనసాగెను. ఆ చోటనిక నిలువరాదని దిగ్గునలేచి నిలువబడెను.

ఇది చూచి మిగిలిన వారిలో నొకడు తొందఱతో సగము త్రాగిన బుడ్డిని చేతబట్టుకొని రెండవ చేతితో మిత్రుని గూర్చుండ జేయుచు "నిదేమి మిత్రమా! చేయరానిపని చేయుచుంటివి? దేవాలయమునకు వచ్చి దేవునారాధింపకున్నను పాపము లేదు కాని మద్య దేవాలయమునకు వచ్చి యామెనుపాసింపకున్న నాగరికలోకమున నగుబాట్లు సంభవింపవా? ఇది యెఱిగినచో నీవిట్లు విముఖుడువగుదువా? అయ్యో! ఎంత తప్పు? ఇంతకు నిందఱకు లేని నియమము నీకేల? నీవు త్రాగని యెడల నతిథులమగు మేమెట్లు త్రాగనగును? ఇట్టి సంతోష సమయమున నలుగురి కిప్పించి నీవును కొంచెము పుచ్చుకొనవలెను కదా? ఈ మద్య మహాదేవిని నేను వర్ణింపజాలను. కాని ఇప్పుడొక్క చుక్కకు గొంతుపట్టితివేని రేపటినుండి నీయంతట నీవే భుజము లెగురవైచుకొని పానీయము కొఱకు ప్రాకులాడెదవని పందెమువేసి పలుకగలను. ఇంతేల! ప్రస్తుతకాలమున మద్యము సేవింపనివాడు మనుజుడేకాడు? రమ్ము! జాగుచేయకు" మనిపల్కుచు తనచేతిలోని మద్యమును బలవంతముగ నాతని గొంతులో పోసెను. అంత మఱియొకడు మఱికొంత పోసెను. ఇంకొకడు కొంచెము పోసెను. అట్లేయందఱాతనిచేత నత్యధికముగ ద్రాగించివైచిరి. మన్మథరావు మిత్రులమాట త్రోసివేయజాలక కాబోలును నోటిని తెఱచి యుంచెను. నాడాతడధికముగ ద్రాగుటవలన మాంద్యము క్రమ్మెను. స్మృతితప్పి పోవజొచ్చెను. అంతట

నతడు తన్మయుడై మద్యమును పొగడుచు పద్యపాదముల నుదహరించుచు నాద్యంతములు లేని యవకతవక మాటలాడుచు తుదకు నేలబడి పొరలాడసాగెను. మిత్రుని దురవస్థగాంచి మిగిలినవారలతని నచ్చోటినుండి కదలించుకొని పోయిరి.

## 3

నాటి నుండియు మన్మథరావు మిత్రుల ప్రోత్సాహము చేత మద్య దేవతకు దాసానుదాసుడై దినదినమదేపనిగ ద్రాగజొచ్చెను. నాలుగు నెలలలోన మిత్రుల ప్రోత్సాహ మవసరము లేకుండ మద్యపానమొనర్ప నేర్చెను. మరిరెండు నెలలలోన నతడు నిపుణుడగు త్రాగుబోతన నెగడెను. అప్పటినుండియు నతడెడతెరిపిలేకుండ త్రాగుటయే పనిగా, ఆనంద మందిరమే నివాస స్థానముగా సంచరింప జొచ్చెను. ధనము క్షీణింప దొడగెను. కాని మన్మథరావు లక్ష్యపెట్టుట లేదు. కాలక్రమమున నతని యసాధారణ మధుపానాసక్తి యందర కవగత మయ్యెను. ఐనను మన్మథునికి భయమేల? నిరాఘాటముగ నతడు తన కృత్యముల నడుపు చుండెను.

అట్లు మన్మథరావు చెప్పరాని త్రాగుబోతుతనము చేత నానందమందిరము వీడజాల కుండెను. మిత్రబల మధికమగుచున్న కొలది యుక్తాయుక్త జ్ఞానశూన్యుడై యవ్వారిగ ధనము వెచ్చింపదొడగెను. సర్వకాల సర్వావస్థల యందాతనికి మద్యపాన మహామంత్ర పునశ్చరణమే పరమావధి యయ్యెను. పాపము ధనికులలో ధనికుడని పేరొందిన మన్మథరావు త్రాగుడుకై ధనమవ్వారిగ వెచ్చింప జొచ్చెను. బుద్ధి మందమైనప్పుడాతనికి భవిష్యత్పరిశీలన జ్ఞానమెట్లలవడును? అతని మాంద్యబుద్ధి నిజోద్యోగభంగకారియగునేమో యని తదీయ శ్రేయోభిలాషులు కొందఱు మిక్కుటముగ బోధించి యతనిని పాన విముఖునిగ చేయ సమకట్టిరి. కాని మన్మథుడు మాత్రము మద్యదేవిని విడువజాలడయ్యెను! అతని ప్రాణ మిత్రుడును, మహోపకారియును, సహచరుడునగు జస్వంతరావను నాతడు బోధించినను మన్మథుడు పెడచెవిని బెట్టెను. ఇక నితరుల మాట లెక్కయేమి? ఒక్కొక్కప్పుడాతనికి బోధింపవచ్చిన వారల నాతడు దుర్భాషలాడి వెడలగొట్టెను. కాన నెవ్వరును మఱి బోధింప సమకట్టరైరి. ఇట్లు మన్మథరావు నిరాఘాటముగ త్రాగజొచ్చెను. తన్నడ్డువారెవ్వరును లేని సర్వస్వతంత్రుడై పోయెను.

ఇట్లుండ క్రమక్రమముగ నాతని యారోగ్యము క్షీణింపదొడగెను. రోగములు పొడసూపెను. ఆనందమందిరమునకేగ వీలులేకపోయెను. అందువలన తగుమాత్ర మింటికే తెప్పించుకొని యతడు సేవింపజొచ్చెను. వైద్యుల యౌషధసేవకంటే మద్యసేవయే ముఖ్యతరమయ్యెను. అతడలవాటు నడచుకొనలేక పోయెను. కావున తన్నలము కొన్ని రోగములు ప్రబలమయ్యెను. త్రాగుటకే వీలులేకపోయెను. అంతట జీతము నష్టముపై రెండు నెలల సెలవు పుచ్చుకొని యతడు మంచము పట్టెను. తెలివితప్పి కలలో సైతము "మద్యము! మద్య" మని కలువరింప జొచ్చెను.

అతడు సెలవు పెట్టిన కాలములో పైయధికారులకతనిపై విరుద్ధముగ గొన్ని యర్జీలు పంపబడియెను. వానియందతని యసాధారణ మాంద్యబుద్ధియు, నుద్యోగము చేయుటకు శక్తి లేమియు నుద్ఘాటింపబడి యుండెను. అతని దుర్వ్యసనాభిలాష యధికముగ

వర్ణింపబడి యుండెను. అధికారులు వీనినన్నిటిని జాగ్రత్తతో పరిశీలించి తుదకునతని యశక్తత కన్నులకు గట్టినట్లు కన్పించుచుండుటచేత మన్మథునుద్యోగ బహిష్కృతు నొనర్చివైచిరి.

మన్మథునికుద్యోగ మూడిపోయెనను చింత యావంతయు లేకపోయెను. తన తలనుండి యొక పెద్ద బరువూడినదనియు నుద్యోగ కారణమున చిత్తము వచ్చినపుడానంద భవనమునకేగ వీలులేకపోయినదనియు నిపుడా చిక్కు తొలగిన దనియు నతడు మీదు మిక్కిలి సంతసించెను.

దైవానుగ్రహమువలన నచిరకాలములో నతని వ్యాధి నిమ్మళించెను. మఱికొన్నాళ్ళ కాతడు పూర్తిగ నారోగ్యవంతుడయ్యెను. కాని వైద్యులు త్రాగుట మానుమన్నను లక్ష్యపెట్టక మన్మథుడు తొల్లిటి కంటె నధికముగ బానింప దొరకొనియెను.

౪

ఒకనాటి మధ్యాహ్నమున నొంటిగంట యగునప్పుడు మన్మథుడు నిజగృహంబున నిద్రించుచుండెను. ఎన్నడునాతనికి పగలు నిద్రించెడు నలవాటు లేదు. కానినాడు భోజనము చేసి శయ్యపై మేనువాల్చునంతనే నిద్రాదేవి యావహించి యతనిని విస్మృతునొనర్చెను. అట్లు నిద్రపోయిన మన్మథరావు సాయంకాలమారు గంటలకు గాని మేలుకొనజాల డయ్యెను. మేలుకొని వేళమించినదని యాశ్చర్యమొందుచు నింకను నిద్రమత్తు పోవనందున మరొక్కమారు శయ్యాగతుడగునంతలో గది గుమ్మముదాటి వచ్చుచున్న మాలతి ప్రత్యక్ష్య మయ్యెను.

ఆమె భర్తనుగాంచి చిరునవ్వు తోడ సమీపించి మంచమునకు బ్రక్కగల టేబిలునానుకొని నిలువబడియెను. అతడప్పుడానందమందిరమునకు జన నూహించుచుండెను. ఇది గ్రహించి మాలతి సంభాషణలతో నాతని మరపించెను. ప్రియురాలి వాక్యసుధా స్రవంతినిలో మున్గి తేలుచు మన్మథుడు తన్మయుడై పోయెను. అంతట మాలతి "మీరనుదినమును వందలకొలది సీసాల నుత్తవి గావించుచుండ నేను దినమునకొక యాలి చిప్పెడు' పానీయము నర్థించిన నపరాధమేమి? ఈ నా చిన్న కోరికనే నిరాకరింతురా" యని నిజమనో మన్మథుడగు మన్మథరావును ప్రశ్నించెను.

మాలతి కోరిక మన్మథునాశ్చర్యచకితునొనర్చెను. మఱుక్షణమున మహానంద సంభరితునొనర్చెను. ఇక నాతడు భార్య కోరికను నిరాకరింప దలంపలేదు! ఆమెకూడ దనతో సమానురాలయ్యెనని సంతృప్తి వహించివెంటనే ధనాగారమును భార్యవశ్య మొనర్చి నీ ఇష్టము వచ్చినట్లు వెచ్చించుకొనుమని పల్కెను. ఇందులకు మాలతి పొందిన యానందమునకు బరిమితి లేకపోయెను.

అనంతరము మన్మథరావానందమందిరాభిముఖుడై వెడలిపోయెను. అధికానందము తోడ నధికముగ బానించెను.

౫

దినమున కొక రాయి చొప్పున దీసినచో పర్వతములు కూడ దరిగిపోవునందురు. అట్లే నవనిధుల కధిపతియగు కుబేరుని ధనాగారమును కూడా దిన వెచ్చములతోడ దరుగ గొట్టవచ్చును. భార్యాభర్త లవ్వారిగ ధనమును వ్యయమొనర్చుచుండ వారలెంత ధనికులైనను

దారిద్ర్యమునకు లోబడ వలసినదే కదా! పాపము మన్మథుని యుద్యోగ మిదివఱకే యూడిపోవుటవలన నాదాయము లేదయ్యెను. ఇక దదీయ మద్యపానము నిరాఘాటముగా సాగిపోవుచుండుటవలన వ్యయమధికమగు చుండెను. నాలుగయిదు సంవత్సరములిటులే గడిచి పోయెను. మన్మథుని స్థితి మాఱుమొగము పట్టెను. దరిద్ర దేవత మెల్లగ వచ్చి యాశ్రయించుచుండెను. ఇంటిలో సంవత్సరముల నుండి కనిపెట్టుకొనియున్న దాసదాసీజను లొక్కరొక్కరే గృహమును వీడిపోవుచుండిరి. మన్మథరావు వారిజీతము వారల కిచ్చి సాగనంపుసరికి యజ్ఞము చేసినట్లయ్యెను. ఆనందమందిరమునుండి యనేక పర్యాయములు బాకీధనముకై పత్రికలు వచ్చుచుండెను. పాపము-గొప్పబ్రదుకు బ్రతికిన మన్మథుని కిది దుస్సంకట మయ్యెను. కాని యింతకును మహానర్థదాయకమగు మద్యపానమును మానజాలడయ్యెను. అదియే ప్రస్తుత దుస్థితికి మూలకారణమని గ్రహింపజాలడయ్యెను. ఎట్టి హీనస్థితిలోనున్నను పూటపూటకును పుచ్చుకొనకుండిన నేమియు తోచకుండెను.

అట్లే దినములు గడచిపోవుచుండెను. పోయిన యుద్యోగము తిరిగి సంపాదించు కొనుటకు గూడ ప్రయత్నింపక మన్మథరావు మధుపానవ్యసన లోలుడయ్యెను. ధనము చేతలేనందున స్థిరాస్థికి గూడ కాళ్ళు వచ్చుచున్నట్లుండెను. వ్యవహారములనన్నిటి నతని భార్యయే పరిశీలించుచున్నను, ఆమెయు మధుసేవనముననే కాబోలు మాంద్యముజెంది యున్నట్లు చూపట్టుచుండెను. మన్మథరావాదాయవ్యయముల బరిశీలించుచుండుడే లేదు. అతడు సర్వకాలములందును చిదానంద స్వరూపియై బాహ్యలోకమునకును, దనకును సంబంధమే లేనట్లు చూపట్టు చుండెను.

౬

పూనానగరమున సుప్రసిద్ధుడును, మహనీయుడునగు జస్వంతరాయని మరణవార్త తన్నగర వాస్తవ్యులకు దారుణ నిర్ఘాంతపాత సదృశమయ్యెను. అనేక సుగుణగుణ శోభితుడగు జస్వంతుని హఠాన్మరణమునకు దపింపనివాడేలేడు. ఎట్టకేలకా నగరవాస్తవ్యులందఱురడిల్లి మహాత్ముడగు జస్వంతుని ధవళకీర్తి చిరస్థాయిగ నుండుట కేదైన ఘనకార్యమొనర్ప సమకట్టిరి. అధిక ధన సంపన్నులగు పూనా నగర వాస్తవ్యులు సంకల్పించుకొనిన కార్యము వ్యర్థమగునా? అదియుగాక మహానుభావుడగు జస్వంతుని కొఱకొనర్చెడు కార్యమున కెవ్వడు వెనుదీయును? కావుననే ఆ ఘనకార్యమునకు బ్రతి పౌరుడును సాధ్యమగు ధనసహాయ మొనర్చెను.

కాని మన్మథరావుకీ యుదంత మావంతయు దెలియకుండెను. నిరంతర మద్య పానోల్లాసియై యానందమందిరమున బడి యుండిన యతనికి జస్వంతుని చావెట్లు తెలియనగును. పురమంతయు దుర్భర విచారాగ్ని హోత్ర దంద్యహ్యమానమైనన్ను, ఆనంద భవనముమాత్ర మమృతార్ణవముననే తేలియాడుచుండును. కావుననే మన్మథునికి ప్రాణ స్నేహితుడును, ప్రాణాధికుడునగు జస్వంతుని మరణవార్త తెలియదయ్యెను. కాని పురజనులు తాము తలపెట్టిన మహత్కార్యార్థమర్థ మర్థించుచు నానందమందిరమున కరుగుదెంచి నంతట మన్మథరావు సర్వనాశనకరమగు మిత్రమరణవార్తను వినియెను. అంతటితోడ నతని హృదయము చలించిపోయెను. దుఃఖ స్రవంతిని నిరాఘాటముగ బ్రవహింపసాగెను. అతడా ప్రవాహము నరికట్టజాలడయ్యెను.

అతడట్లు విచారించుచుండ జనులు తామొనర్పనున్న కార్యము నెఱుంగజేసి జస్వంతునికై ప్రాణములనైన ధారబోయవలసిన మన్మథరావును రెండు వందల రూపాయలను మాత్ర మొసంగ గోరిరి. అట్లేయని మన్మథుడు వారలనంపి తానింటికిపోయెను. ఇక మిత్రుని కొఱకై చింతించుట కంటే ధనమెక్కడనుండి తీసికొని రాగలనని చింతింప జొచ్చెను. అంతట నాతనికి దమ దారిద్ర్యస్థితి యంతయు గన్నులకు గట్టినట్లు గోచరించెను. తమ దురవస్థకు మద్యపానమే కారణభూతమని గ్రహింపజాలెను. ధనహీనుడనగు తానిక వ్యర్థుడనని తిట్టుకొనియెను. మిత్రుని జ్ఞాపకార్థమొనర్చెడు సత్కార్యమునకు మొదట కాలుపెట్టవలసిన తానే ధనసహాయమొనర్పకుండుటా! పాపము మన్మథుడు సంధిగ్ధావస్థలో పడెను. వలలో పడిన చేపవలె తటతటలాడి పోవుచుండెను. ఇక నేమైనను చిరనిర్మితమగు నిజగృహమునుజూపి ధనమప్పుతెచ్చి ఋణవిముక్తుడగుటకు దృఢ నిశ్చితుడయ్యెను.

అట్లతడు నిశ్చయించి భార్యకు తన యవస్థ నెఱుంగ జేసెను. ఆమెయును జస్వంతుని మృతికి బెల్లుగదల్లడిల్లెను. మన్మథుడామె నూరడించుచు, "సుదతీ! జస్వంతుని మృతికి నేనుపొందు విచారము కంటే, ఆతని ఋణము దీర్చుకొనజాలనైతిగదా యను చింతయే సహస్రాధికమై నన్ను బాధించుచున్నది సుమా! మాలతీ! వ్యర్థుడను, నిర్ధనుడగు నేనిక చేయగల్గునదేమి? మన యవస్థనీకు గరతలామలకమే కదా! నాయుద్యోగము నాడే యూడినది. చరాస్థియందు గవ్వయైన గన్పించుటలేదు. భూములమ్మబడినవని నీవే పల్కితివి! ఇన్ని దురవస్థలకు బాల్పడియుండ మిత్రుని మరణగాథ కర్ణకఠోరముగ దాకినది. జస్వంతుని జ్ఞాపకార్థము పురజనులొక వైద్యశాలను నిర్మించి యందాతని విగ్రహము బ్రతిష్ఠింపదలచిరి. ఇది ధనముతోబనికాని మాటలతోడిది కాదు. రెండువందల రూపాయలనిమ్మనిరి. ఉన్నత దశయందున్నచో కోరకనే వేయి రూపాయల నొసంగ గల్గిన నాతల యిప్పుడు రెండువందల రూకలకు జేయదయ్యెను. ఇక నేనెట్లయిన ధనమొసంగక తీరదుకదా! కావున మాలతీ! మఱి చెప్పకేమి! మన యింటిమీద నా మొత్తము వెచ్చి యొసంగ గృతనిశ్చయుడనైతిని. ఇంతకంటే నాకు గత్యంతరమేమి?" యని దుఃఖింపసాగెను.

ఇవి యంతయువిని మాలతి లోనిదుఃఖమును మరచి యొక చిరునవ్వు నవ్వి "మనోహరా! ఎందఱో తమకు గూర్చుమిత్రులు త్రాగుడు మానుడని చెవినిల్లుకట్టుకొని పోరినను వినక ఆనందమందిరమునకు దాసానుదాసులై నందులకు ఫలమిదియే! త్రాగుడనర్థ దాయకమని యొకరు చెప్పినపుడు గ్రహింపజాలని మీకిది స్వానుభవమువలన సృష్టీ కృతమై యుండవచ్చును! ఆహా! మన యీ దారిద్ర్యమునకా పాడుత్రాగుడేకదా మూల కారణము! ఇక నన్ను మీరేమి చేసినను జేతురు గాక! ఈ సమయమున నే జెప్ప దలచినది చెప్పకమానను! అది ప్రాణహానికరమని గ్రహింపజేయక మానను! ఇంతేల? దేహ దార్ఢ్యసంపన్నులగు మీరు త్రాగుడువలన చిక్కి శల్యముగ జూపట్టుటలేదా! మీకు నేను బోధింపవలెనా?..."అని పల్కుచున్నప్పుడు మన్మథుని ముఖమింత యయ్యెను. అతడు వెంటనే భార్య పాదములపై వ్రాలి "మాలతీ! ఓ మాలతీ! కష్టపరంపరల కారణమున నిదివఱకే మొఱడైన యీమానిని నీ మస్సాహవాక్యాగ్ని కీలలచే భస్మీపటల మొనర్ప జూడకుము! ఇదిగో విశ్వేశ్వరుని సాక్షిగ జెప్పెదను. నేటినుండి యానందమందిరమున

మొగము జూపను! త్రాగుడు పూర్తిగా మాని వేసెదను. ఇక దయాతరంగిణివై నన్ను రక్షింపుము! నీవును త్రాగుచుంటివే కాని నీమముతో లేవుకదా! పోనిమ్ము! ఇక నా ప్రసక్తియేల? మిత్రుని ఋణము దీర్పబోవునా నిశ్చితమును పనులలో బెట్టబోయెదను! దరిద్రుడనగు నాకిక గతియేమి?" యని లేచెను.

"నాథా ఎట్టి దైన్యపు వాక్యములివి! మీరు దరిద్రులా! ఎవ్వరందురు? పూనా నగరమున మనకంటే ధనవంతులేరి? మీకు ధనమునకై మనయిల్లే కావలయునా? మనముచ్ఛస్థితిలోనే యున్నామే? ఉన్నతస్థితిలో నున్నప్పుడు వేయి రూపాయలొసగుటకు గదా మీరు నిశ్చయించుకొనిరి! అట్లయిన నదిగో ధన పేటిక! అందీ క్షణమున నైదువేల రూపాయలు కలవు! మన మింకను భాగ్యవంతులమనియే విశ్వసింతురా? అదిగో! అట్లాశ్చర్యమొందనేల? మీరు ద్రవ్యార్థ మెచ్చటకును పోవనవసరము లేదు! మన భాగ్యము తిరుగు మొగము పెట్టుచున్నవని నేనొక యుపాయము చేత సముద్ర గర్భమున బడి నశింపనున్న నావ నుద్ధరించితి"నని పల్కుచు మన్మథుని గూర్చుండ జేసెను.

ఇక మన్మథుని యాశ్చర్యమునకు బారమేమున్నది? తన భార్యకాధన మెక్కడిదనియే యతడచ్చెరువొందసాగెను. దరిద్రులగు తాము ధనవంతులమని చెప్పుచుండుట చేత మన్మథుడామెకు పిచ్చిపట్టినదేమోయని యనుకొనెను. అంతలో మాలతి "నాథా! మీరిట్లాశ్చర్య మొందుదురని నాకు తెలియును. ఆశ్చర్యమేల! మనము ధనవంతులమే! ఇట్టి వేయి రూపాయలు మనకింకను గలవు. అమ్మబడినవని నేను పల్కిన మన భూములు కూడ నిజముగా నమ్ముడుకాలేదు. అవియును మన స్వాధీనములోనే యున్నవి! ఇధంతయు నేను పన్నిన తంత్రము! మిమ్ము మద్యపాన విముఖుల నొనర్చుటకే నేనే నాటకమాడితిని! ఎట్టీ చిత్రచర్య నడిపించితినో మీకు తెలియదుకాన వినుడు. అలనాడు మిమ్ములను రోజునకు గొంత పానీయమును ప్రసాదింపుడని ప్రార్థించుట జ్ఞాపకమున్నదా? అప్పుడు మీరు నాకు ధనాగారమును వశ్యమొనర్చిరి. నాటినుండియు నేను మీ కంటే నెక్కుడుగ ద్రాగినట్లు చూపట్టు చుంటిని! ధనమంతయు వేర్వేఱు పేటికలలో దాచి మీకు కనబడకుండ జేయుచు నంతయు తరగిపోవుచున్నట్లు చూపట్ట జేసితిని. మీరట్లే తలచి యుండిరి. మన దాసీజనమును కూడా నేనే తొలగించి మనదారిద్ర్యావస్థ యెల్లరకును తెలియునట్లొ నర్చితిని. ఇన్ని విధముల జేసి పైకినిర్ధనులుగా జూపట్టజేసినను, మనమింకను మహాదైశ్వర్య వంతులమే! మీరీ మధ్యకాలమున వినియోగించిన ధనము పోయినను నదియొక నష్టము కాదు. ఇప్పటికిని మన మాగర్భశ్రీమంతులమే! పోయిన మీ యుద్యోగమునకు గూడ జింతింప నవసరము లేదు. లేఖామూలమున మీసంగతిని మా తండ్రిగారి కెఱుంగజేయగా నాయన తన యావచ్ఛక్తులను వినియోగించి ప్రయాసమొందుచున్నారు. ఇప్పటికి తత్ప్రయత్నములు కొనసాగుచున్నట్లున్నవి. మీరుద్యోగమునకు బాట్లుపడకున్న నేనూర కుందునా? కొలది రోజులకే మీరు మరల నుద్యోగము చేయుచుందురు. మన పూర్వపు దినములు మరల లభించును. ఇకనీ మధ్య కాలములో జరిగినదానిని స్వప్నగత వృత్తాంతముగ దలచి మఱచిపొండు. జస్వంతరాయని కొఱకిక మనము చేయగల్గున దేమి? ఈ రూపాయల గొనిపోయి యాయవశిష్టమును దీర్చుకొనుడు. ఇక మీకు కావలసిన దింతకంటే నేమి కలదు?" అని పల్కుచు ధనమొసంగెను.

ఆ వాక్యముల నాకర్ణింపగనే మన్మథుని హృదయము ద్రవీభూతమయ్యెను. సుగుణ రత్నాకరమగు తన భార్యను మనస్సులోనే పరిపరి విధముల బొగడుచు మాటాడనేరక బొటనవ్రేలితో నేలను రాయుచుండెను. అంతలో తంతివార్తాహరుండొక తంతి గొనివచ్చి మన్మథుని కొసంగిపోయెను. అందాతని యుద్యోగము తిరిగి యొసంగ బడినదనియు, నవి సెలవుదినములు కావున సెలవులు ముగియగానే వచ్చిపనిలో ప్రవేశింపవచ్చుననియు నుండెను. ఇక మన్మథుని హృదయస్థితి నేమని వర్ణింపవచ్చును. అతని యంతరంగమునందలి వివిధ భావ పరంపరలు స్తోత్రరూపమున నీవలకు బ్రవహించి మాలతిని ముంచి వైచెను. కొంతవఱకు పొగడుట సాగిన పిమ్మట మన్మథరావు భార్య నభినందించుచు ధనము జేకొని వెడలిపోయెను.

క్షణకాలములో మన్మథుని శుభవార్త నగరమెల్ల వ్యాపించెను. అతడు మద్యపానమును మానివేసెదనని ఘోరమగు శపథమొనర్చెనని యూరెల్ల ననుకొనసాగిరి. పూర్వము వలెనే మన్మథుడు గౌరవపురస్సరముగ నెల్లరిచేత నభినందితుడయ్యెను. ఆనందమందిరము నందలి యతని మిత్రులు మన్మథుని హృదయ పరివర్తనమును మాలతియొక్క యనన్య సామాన్య ప్రవర్తనము నెఱింగి తాముకూడ మద్యపాన విముఖులైరి. పూర్వమెచ్చట మధురసము విశేషముగ బ్రవహించెనో అట్టి యానంద మందిరమునందే మద్యపాన నిషేధసభ యనెడు సంఘ మప్పుడప్పుడు సమావేశ మగుచుండెను. దానికి మన్మథరావే యధ్యక్షుడయ్యెను. పూనానగరమున నెక్కుడ పలుకుబడిగల మన్మథుని వాక్యముల చేత పురమందెవ్వరును; ఎన్నడును, ఎచ్చటను మద్యమును ముట్టుకొనరైరి. సముచిత కాలములో జస్వంతరాయ జ్ఞాపకార్థమగు వైద్యశాలకూడా నిర్మితమయ్యెను. అందాతని శిలావిగ్రహము ప్రతిష్ఠింప బడియెను. ఆ వైద్యశాలకు మన్మథరావే శంకుస్థాపన మొనర్చెను.

భార్యాపుత్రుల తోడ మన్మథరావు మహదైశ్వర్య శోభితుడై సుఖముగా గాలము గడపెను.

ముద్రణ : లలిత, మాసపత్రిక
డిశెంబరు 1926